# దానం

గిరిధరరావు కలిగిన వాళ్ళ జాబితాలో పడకపోయినా అడగని వాళ్ళ పరిస్థితిని అర్థం చేసుకుని గుప్తంగా దానం చేసినవాడు. తన దగ్గర ఒక్క పది రూపాయలే మిగిలిన రోజున ఆ పది తనకన్నా అవసరమైనవానికి యిచ్చినవాడు. దానం చెయ్యటం ఒక అలవాటుగా అబ్బినందున యేదీ లేకపోతే వూరకనే రక్తదానం చేసేవాడు. భార్యకు కూడా తెలియని దానాలు చేసినవాడు యిప్పుడు దానం పుచ్చుకోడానికి సిద్ధంగా వున్నాడు.

భార్య భానుమతితో రెండు పదుల కాపురంలో ఆమె లేకపోతే యింట్లో యేదీ జరగని పరిస్థితి వచ్చింది. మంచి మర్యాదలకు, శీలానికి కాలానికి విలువలను ప్రసాదించింది. ఉన్న ఒక బిడ్డ రాధారాణి తల్లి ప్రాణంతో ముడి పెట్టుకుంది. భానుమతి లేకపోతే రాధారాణి లేదు. ఇద్దరూ లేకపోతే తన యిల్లు కూలిపోతుంది.

అసలు యీ జబ్బు యెలా మొదలిడిందంటే యెప్పుడూ లేనిది భానుమతికి చిరుకోపం తరచు వచ్చేది. ముఖం వాపు చూసి దోమకాటేమోనని వూరుకుంటే చిన్న తలతిరుగు. రోగమొకటి, మందు వేరొకటి కావటం వల్ల

ప్రమాద పరిస్థితికి వచ్చింది. చొప్పదామిలో నిప్పుదాచుకున్న మంటలు చూశాకగానీ ప్రమాదం తెలుసుకోలేదు. ఉన్నదంతా అవేశాను రాయవెల్లూరు ఆసుపత్రికి భానుమతిని తీసుకు వెళ్ళాడు.

రెండు మూత్రపిండాలు పాడయిపోయాయి. తను ఒక మూత్రపిండం యివ్వడానికి సిద్ధమైతే బ్లడ్ గ్రూపు పడలేదు. తన ఆతృతలో తన దగ్గర చుట్టాలకాళ్ళెందరివో పట్టాడు. భార్య స్వయం చెల్లెలు బ్లడ్‌గ్రూపు సరిపోయింది. ఇక వారం రోజుల్లో ఆపరేషను చేస్తారనగా కారణాలు చెప్పకండా కాదన్నది. మిగతా చుట్టాలు మౌనంగా కాదనేశారు. ఎందరికో చెప్పాడు. ఒకడు ఒక దాతను తెచ్చాడు. ఆ తెచ్చిన వాడెవడో తెలియదు. ఆమె బ్లడ్ గ్రూపు సరిపడిందన్నారు. అతను కోరిన వన్నిటికీ ఒప్పుకున్నాడు. పెద్ద డాక్టరు దగ్గిరకు వెళ్ళాడు. డాక్టరు లోకం చూసినవాడు, అనుభవజ్ఞుడు. ఆమెను పరీక్షించి-

"ఎంత డబ్బిచ్చారు?" గిరిధర రావుని ప్రశ్నించాడు.

గిరిధరరావు అబద్ధం చెప్పలేక మౌనం దాల్చాడు.

"ఇది దానం కాదు, అనాధపై సవారీ చెయ్యటం!"

అంతతో ఆగక కోపంగా "కత్తి వ్యాపారం చేసినవాళ్ళకన్నా, లంచాలు దోచుకున్నవాళ్ళకన్నా, అబద్ధాలు చెప్పి సవారీ చేసే వాళ్ళకన్నా మీరేవిధంగా భిన్నమైనవారు? ఇది నిలువు దోపిడి!" అన్నాడు డాక్టర్.

బెత్తం దెబ్బలు తిన్న బడి పిల్లవానిలా కుదించుకపోతే, అతని కళ్ళల్లో నీరు చూసి కామోసు డాక్టరు శాంతించి "ఈవిడ బిచ్చకత్తె. అందులో గుడ్డిది. అంత మాత్రాన ఆమె ఆరోగ్యంగా బతికే హక్కును మీ డబ్బుతో కొనేస్తారా?" అన్నాడు.

"నా ఆతృతలో చేసిన యీ తప్పును క్షమించండి" అన్నాడు గిరిధరరావు

లాడ్జికి వచ్చాక ఒంటరిగా యెంతోసేపు యేడ్చుకున్నాడు. ఒకరి నమ్మకం -ఇంకొకరికది మూఢ నమ్మకం కావచ్చు. ఐనా తనకు ఆ నమ్మకం పోరాడటానికి శక్తి నిస్తుందేమోనని ఆలోచించాడు. మంచి కొంచెమైనా చాలు, విత్తనం చిన్నదైనా చాలు అన్న సామెత గుర్తుకొచ్చింది. మంచివాని ఆరాటాన్ని అర్థం చేసుకునే యింకో మంచివాడు వుండి తీరతాడన్న నమ్మకంతో పత్రికల్లో ఒక ప్రకటన యిచ్చాడు. "ముప్పయి-నలభయి యేళ్ళ మధ్య వయసులో వున్నవారు, బ్లడ్‌గ్రూపు 'పాజిటివ్' 'O' గలవారి మూత్రపిండం దానం చేయమని కోరుతున్నాను. షరా: నా భార్య బతికితే నా ఒకేబిడ్డ నిలుస్తుంది."

తన యెడ్రసు రాశాడు తన వుద్యోగ వివరాలు, అసలు వునికి కూడా పత్రికా ప్రకటనలో యిరికించాడు.

పది రోజులు దాటినా ఒక్క వుత్తరం రాలేదు. తనవలన వుపకారం పొందిన వందలాది వ్యక్తుల్లో ఒక్కరైనా ముందుకు రాలేదని ఆరాటంలో కొట్టుకు పోతుంటే రెండు వారాలు పోయాక ఒక కవరు లాడ్జిలో పడివుంది. గబగబ విప్పాడు.

"మీరు పత్రికలో ప్రచురించిన ప్రకటన చూశాను. నేను శనివారం పది హేనవ తేదీన మెయిల్‌లో బయలుదేరి ఆదివారం తెల్లవారేసరికి మద్రాసు సెంట్రల్ చేరుకుంటాను. ఆకుపచ్చని చీర, తెల్ల జాకెట్‌తో, కళ్ళకు నీలి అద్దాలు - ప్లాటుఫారంలో ఒక స్తంభం దగ్గర నిల్చుంటాను. మీరు ఆసరికి మద్రాసు రాగలరని ఆశిస్తున్నాను.

చిట్టెమ్మ

దానవాయి పేట, రాజమండ్రి"

ఎవరీ చిట్టెమ్మ? ఈ పేరెప్పుడూ వినలేదు. ఈ పేరుగల వారికెప్పుడూ తను వుపకారం చేసినట్లులేదు. బ్లడ్ గ్రూపు గురించి రాయలేదు. వయస్సెంతో రాయలేదు. బహుశః డబ్బు కోసం వస్తోందేమో? తన అనుమానాలన్నీ అసుపత్రిలో పెళ్ళాంతో యేకరువు పెత్తే "ఏదిచ్చినా దేముడు యెవరో మనిషి ద్వారానే యిస్తాడు కదా!" అంది.

సుఖాల్లోకంటే, కష్టాల్లో బ్రతికిన బ్రతుకునించి మనిషి బహుశః నమ్మకాలను యేరుకుంటాడేమో? దంపతులిద్దరూ తమ చేతిలో యేమీలేదని, అంతా భగవదేచ్ఛ అనీ, యేం రాసుంటే అదే జరుగుతుందనీ అనుకుంటేగానీ బతకడానికి తగ్గ కనీస ధైర్యం తెచ్చుకోలేకపోతున్నారిప్పుడు.

ఆదివారం వుదయం, మద్రాసు సెంట్రల్ స్టేషనులో చిట్టెమ్మను సులువుగా పోల్చుకున్నాడు. ఆవిడ తన వెనుకనే నడుస్తుంటే యెన్నెన్నో అనుమానాలు. 'మనిషి యింత లావుగా వుందే? బ్లడ్‌గ్రూపు సరిపోయినా యీవిడకు హై బ్లడ్‌ప్రజరో, సుగర్ కంప్లయింటో వుంటే? ఆవిడ నడుస్తుంటే ప్లాటుఫారం గజగజలాడుతున్నా ఆవిడ గొంతుక అసలే పెగల్లేదు. మాట యెలాంటిదో విందామంటే అన్నీ సైగలతో చెప్తోంది! కొంపతీసి మూగది కాదుకదా! మూగదైతే మళ్ళీ ఆ డాక్టరుతో చిక్కే. దళసరి నీలి కళ్ళద్దాలు పెట్టుకుంది. కళ్ళు జబ్బా? ఏమన్నా యెలా తీసుకుంటుందోనన్న భయంతో వూరుకున్నాడు. ఇంత డబ్బిమ్మని అడుగుతుందేమోనని యెదురుచూశాడు. లాడ్జిలో ఆమెకు ప్రత్యేకమైన గది. ఎప్పుడు డాక్టరు దగ్గరకు వెళ్ళాలో చెప్పాడు. ఆమెకు కిళ్లీలు అలవాటులా వుంది. బహుశః కిల్లీ దుకాణం వుందేమోనని అనుకున్నాడు. ఇక్కడి భోజనం నచ్చక యింకో హోటల్‌కు వెళ్ళి తినటం చూశాడు. ఆమె వెంటపడి డబ్బు చెల్లించడానికి వెళ్తే ఆమె సైగలతోనే ఒప్పుకోలేదు.

ఈ రెండు రోజులలో యీ చిట్టెమ్మ అతనికి అర్థంకాని పొడుపు కథలానే మనసులో తిరుగుతోంది. మంగళవారం పుదయం డాక్టరు ఆమెనే తన యెదరగా కూర్చోబెట్టి గిరిధర రావును బయట కూర్చోమన్నాడు.

"నీ పేరు?"

"చిట్టెమ్మ."

"మీ ఆయన..."

"లేరు"

"మరి....ఆ...."

''ఈ బొట్టు ఒక నమ్మకంతో పెట్టుకుంటాను."

"నువ్వేదైనా వుద్యోగం చేస్తున్నావా?"

"రాజమండ్రి అసుపత్రిలో అయాగా వుంటున్నాను."

"నీ మూత్రపిండం నిజంగా దానం చేస్తున్నావా లేక...."

"ముమ్మాటికీ చెప్తున్నాను - దానం చేస్తున్నాను."

"గిరిధర రావుగానీ, భానుమతి గానీ మీ చుట్టమా?"

"కాదు."

"ఇదివరకెప్పుడైనా వారివలన ఉపకారం పొందావా?"

"లేదు."

"మరి అంత దూరంనించి యెందుకొచ్చావ్?"

"ఇలాగైనా ఒకరి కళ్లల్లో నీరు ఆపగలనని.... డాక్టరు గారూ! నేను అన్నీ టెస్టులు చెయ్యించుకునే వచ్చాను. ఇవిగో రిపోర్టులు మీకు అనుమానంగా వుంటే మళ్లీ యీ టెస్టులన్నీ చెయ్యించవచ్చు. ఆలస్యం చేసి ఆ యిల్లాలి బాధను పొడిగించకండి" అంటూ లేచిపోయింది. డాక్టరు ఆమె వైపు యెగాదిగా చూశాడు. అంతే.

ఇద్దరికీ ఆపరేషన్లు అయిపోయాయి. తన భార్య దగ్గరకన్నా చిట్టెమ్మ దగ్గరే గిరిధర రావు కూర్చున్నాడు. తను చెయ్యగలిగిందల్లా తన ప్రియాతి ప్రియమైన భార్యకు చెయ్యగలిగాననీ, ఆ ఆనందం తృప్తి యీ చిట్టెమ్మ యిచ్చిందని అక్కడే ఆమెను కొలిచేటట్టు కూర్చున్నాడు. అలా కూర్చొని ఆలోచించుకుంటే అంతరంలో అనుమానాలు పెనవేసుకున్నాయి. తను దానాలెందుకు చేసినట్లు? ఏదో కష్టాల్లో ఆ పుణ్యం ఆదుకుంటుందనేగా! ఏం కోరకుండా దానం చేసిన చిట్టెమ్మ శిబి చక్రవర్తి కోవలోనికి చేరిపోయిందనుకున్నాడు.

భానుమతి యింకా కొన్నాళ్ళు అసుపత్రిలో వుండాలి. చిట్టెమ్మ విడుదలై అటూ యిటూ తిరుగుతోంది. ఆమె ఒంటరిగా తిరిగి వెళ్ళిపోతానన్నా గిరిధర రావు ఒప్పుకోలేదు. తను ఆమెతో రాజమండ్రి ప్రయాణమయ్యాడు.

చిట్టెమ్మ యిల్లు చిన్నదే. ఇంట్లో సామాన్లు అట్టే లేవు. ఇంట్లో యింకెవరూ లేరు. ఆమె గబగబ యిల్లూ వాకిలీ తుడిచి వంట చేసింది. భోజనా లయ్యాక కాస్త విశ్రాంతి తీసుకోండని మంచం మీద దుప్పటి పరిచింది.

"విశ్రాంతి మీకు కావాలి, నాకు కాదు. మీరే పడుకోండి'' అన్నాడు.

మీరు మీరని యెవ్వరూ పడుకోలేదు. ఈవిడ ఋణం యెలా తీర్చుకోవటం అని అతను ఆలోచిస్తుంటే ఆవిడ చిరునగవు. ఆ నగవు గతం జ్ఞప్తికి తెచ్చుకుని వర్తమానంలో సాధించానన్న సంతోష చిహ్నం. అలా చిరునగవుతో యెదరగా కూర్చున్న చిట్టెమ్మ.

"ఇంకా నేనెవరినో మీరు పోల్చుకోలేక పోయారు. కాని, మీ విషయాలు, నాకెప్పటికప్పుడు తెలుస్తున్నాయి."

"ఎలా?"

"మా పొరుగువాళ్ళ పెద్దల్లుడు మీ ఆఫీసులో పని చేస్తున్నాడు. ఆయన ద్వారానే మీ ఆవిడను మీరు రాయవెల్లూరు తీసుకువెళ్ళారని తెలిసింది.''

''ఇంతకీ మీరెవరు?''

''ఇంకా పోల్చుకోలేదా?''

''భానుమతి బాధతో మరుపు వచ్చేసింది. మీరే చెప్పండి మీరెవరో?''

''ఇది యిరవై యేళ్ళ క్రితం మాట. అప్పుడు నాకు ఒక్క ముఖ్యమైన కోరిక వుండేది. అది తీరని కోరిక అని తెలిసి మరీ కోరుకున్నాను. మీలాంటి.... అంటే....మీరే భర్త కావాలని. అప్పటికి మీకు పెళ్ళికాలేదు. నాకు అయ్యింది. ఆ రోజుల్లో ఆ అవకాశాలు లేకపోయినా మీరు మీ మిత్రునికి మూత్రపిండం యివ్వడానికి సిద్ధపడ్డారు. ఆ సుశీలనండీ నేను....''

''చిట్టెమ్మగా పేరెందుకు మార్చుకున్నారు?''

"ఈ పల్లెటూరి పిల్ల చిట్టెమ్మ పట్నం పిల్లగా కనిపించాలని మావారే సుశీల అని మార్చేసారు. ఆయన పోతూ ఒక విషయం చెప్పారు.... 'నాకు తెలుసు - గిరి అంటే నీ మనసులో ఆరాధన వుందని. అతను ముందుకొస్తే చేసుకో' అని.''

గిరిధర రావు మనసు ఒక్కసారి యిరవై యేళ్ళు వెనుకకు మళ్ళించాడు. పచ్చని శరీరం. చక్కని ముక్కు. తనివితీరా చూడాలనిపించే ముఖం, ఆ ముఖంలో మాటాడేటట్లు కదిలే కళ్ళు. మర్యాదను పాటించి మమకారాన్ని కాల్చుకున్నాడు. భర్త పోయాక నాలిక చివర వరకు వచ్చిన కోరికను ఆమె నీచమైన కోరిక అనుకుంటుందేమోనని సంశయంతో మౌనం దాల్చాడు. ఆమె కన్న వారింటికి వెళ్ళిపోయింది. గిరి భానుమతిని పెళ్ళాడాడు.

''నీ రుణం యెలా తీర్చుకుంటానో?" అన్నాడు. ఎన్నాళ్ళనించో అనాలనుకున్నది అనేశాడు.

"నే నిచ్చినది దానం కాదు. నాలాంటి మామూలు మనిషి దానం చెయ్య లేదు.''

''ఇంకేమిటిది?''

''ఫలితం ఆశించి చేసిన దానం దానం కాదు.''

''ఏం ఫలితం ఆశించావో విన్నొచ్చా?''

''ఇప్పుడు మీరు మీ ఆవిడ మీద చూపించే ప్రేమానురాగాలు నా మీద కూడా పడినట్లే లెఖ్ఖ! ఇన్నాళ్ళకు యిలా నా కోరిక తీరింది.''

ఆమెతోపాటు అతనూ కన్నీటిపొంగును ఆపుకోలేకపోయాడు.

(1986)